మంగళవారం
31 మార్చి 2026
సంపుటి: 03 సంచిక:2
పేజీలు : 05, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

## ట్రంప్ లక్ష్యం యురేనియం!?

ఇరాన్‌లో 400 కిలోల యురేనియం సీజ్‌కు ప్లాన్
అందుకే భూతలదాడులకు సిద్ధమవుతున్న అగ్రరాజ్యం





# ఇక నక్సల్స్ రహిత భారత్

**ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి స్థానంలేదు**
**నక్సల్స్ ఎజెండాలో అభివృద్ధి అనే అంశమే లేదు**
**నక్సల్స్‌కు మానవత్వం లేదు**
**డెడ్‌లైన్‌కు ఒకరోజు ముందే పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన**

న్యూఢిల్లీ, మార్చి 30 : ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి స్థానంలేదని, నక్సల్స్ ఎజెండాలో అభివృద్ధి అనే అంశం లేనేలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నా రు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతం దేశాభివృద్ధి కాదని, నక్సల్స్‌ను సమర్థించేవారికి మానవత్వమే లేదని తెలిపారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావులేదని.. నక్సలిజాన్ని అంతం చేసిన ఘనత మోదీ సర్కారుదే అని, ఒక ప్పుడు మావోయిస్టులకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో ఇప్పుడు నక్సలిజం అంతమైందని చెప్పారు.మార్చి 31 డెడ్‌లైన్‌లోగా భద్రతా బలగాలు బస్తర్‌లో నక్సలిజాన్ని అంతం చేశాయని అమిత్ షా తెలిపారు. నక్సలిజంపై తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఆయన సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. సమాజంలో అన్యాయాలకు పరి ష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని తెలిపారు. 4,800 మందికి పైగా నక్సల్స్ ఆయుధాలను విడిచిపెట్టి, ప్రభుత్వ పునరావాస కార్యక్రమంలో పాల్గొన్నారని అమిత్ షా చెప్పారు.కాంగ్రెస్ హయాంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసీలకు సంక్షేమ ప్రయోజనాలను అందించడంలో ఆ పార్టీ విఫలమైందని ఆరోపించారు. ప్రతిపక్షాలు నక్సల్ శక్తుల పట్ల సానుభూతి చూపుతున్నాయని ఆరోపించారు. నక్సల్స్ తరఫున మాట్లాడేవారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. 1970 నుంచి ఇప్పటివరకు నక్సలిజాన్ని ఎందుకు అంతం

వివరాలు2లో..

### సహజీవన జంటలకు

# కుటుంబ హోదా

**దేశవ్యాప్తంగా జనగణనకు**
**ఏప్రిల్ 1నుంచి శ్రీకారం**




న్యూఢిల్లీ, మార్చి 30: సహజీవనం చేస్తున్న జంటలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ జంటలకు కుటుంబ హోదా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా జనగణన చేసేందుకు కేంద్రం సన్నద్ధమైంది. ఈ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి రెండు దశలుగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా ఈసారి సహజీవనం చేస్తున్న జంటలకు కుటుంబ హోదా కల్పించాలని నిర్ణయించింది.చాలాకాలంగా కలిసి నివసిస్తున్న వారిని ఒకే కుటుంబంగా పరిగణించాలని కేంద్రం స్పష్టం చేసింది.ఈ విషయాలను రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఇది దేశంలో 16వ జనగణనగా ఉండనుంది.కాగా తొలి దశలో గృహ గణన చేపట్టి అధికారులు మొబైల్ యాప్ సాయంతో ఇంటింటికీ వెళ్లి ఇళ్లకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.ఇది వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది.ఇప్పటివరకు లేనివిధంగా ఈసారి ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కేంద్రం కల్పించింది.జనగణన కోసం 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించారు.ఈ ప్రక్రియలో ఇంటి యజమాని వివరాలు, వ్యక్తిగత సమాచారం, కులం, కమ్యూనిటీ వివరాలు సేకరిస్తారు.ఇంట్లో నివసిస్తున్న వారి సంఖ్య, వారి వయస్సు వంటి అంశాలను కూడా నమోదు చేస్తారు.అదనంగా, ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్) గృహోపకరణాలు (రేడియో, టీవీ) యాజమాన్యం గురించి కూడా

వివరాలు2లో..

# 2029 కల్లా అందరికీ ఇళ్లు

**5.50 లక్షల గృహప్రవేశాలు చేయించాం**
**1 నుంచి రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు**
**ప్రజాభిప్రాయం తెలుసుకుని మెరుగైన**
**పాలన అందిస్తాం : సూళ్లూరుపేటలో చంద్రబాబు**

తిరుపతి : రాష్ట్రంలోని అర్హులందరికీ 2029 కల్లా గృహవసతి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రెండో విడతల్లో 5.50 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు చేయించామని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి మరో రెండు లక్షలు, సెప్టెంబర్ కల్లా మరో 1.60 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. మిగిలిన పేదలకు ఎన్నికల హామీలో భాగంగా నగరాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మండలం బిరుదువాడలో 2,064 టిడ్కో ఇళ్లను సోమవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. కొత్తింట్లోకి వెళ్లిన

వివరాలు2లో..



# కల్తీ నియంత్రణకు కఠిన వ్యవస్థ



**సన్నబియ్యం పంపిణీతో.. బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్**

హైదరాబాద్, : తెలంగాణలో ఆహార కల్తీని అరికట్టేందుకు, కల్తీ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు ఈగల్, హైడ్రా తరహాలో అత్యాధునిక అత్యంత కఠినమైన వ్యవస్థను తీసుకురానున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్లను నియంత్రించడానికి ఆనాడు కాంగ్రెస్ పార్టీ పకడ్బందీ చట్టం తీసుకొచ్చిందని గుర్తు చేశారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆహార భద్రతా చట్టాలను, వ్యవస్థలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని సీఎం తెలిపారు. అధ్యయనం అనంతరం పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ మాఫియాకు బుద్ధి చెపుతామని హెచ్చరించారు. శాసన మండలి కమిటీ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యతో కలిసి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.దేశంలో రైతుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కనీస

వివరాలు2లో..

### తమిళనాడు ఎన్నికలు..

# స్టాలిన్, విజయ్ నామినేషన్లు



: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ క్రమంలోనే ప్రచారం, నామినేషన్ల పర్వం జోరందుకుంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే నేత నామినేషన్ దాఖలు చేశారు. అటు టీవీకే అధినేత, నటుడు విజయ్ కూడా నామినేషన్ సమర్పించారు.వరుసగా మూడు సార్లు కొలతూరు నియోజక వర్గం నుంచి గెలుపొందిన స్టాలిన్ మరోసారి అక్కడ నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం.. సీఎం రోడ్ షో నిర్వహించారు. "దిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోంది. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నాం" అని స్టాలిన్ పేర్కొన్నారు.ఇక, తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్ ఈ ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తోన్న సంగతి తెలిసిందే..



పెరంబూర్, తూర్పు తిరుచ్చి నుంచి బరిలో దిగుతున్నారు. తాజాగా పెరంబూర్ స్థానంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనను చూసేందుకు అభిమానులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున వచ్చారు. "నేను ఎంపిక చేసిన వారు కేవలం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మాత్రమే కాదు. ప్రజల రక్షకులు కూడా. వారికి మీ మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా"

వివరాలు2లో..


### భారీ నష్టాల్లో

# ముగిసిన స్టాక్ మార్కెట్లు



# పథకం ప్రకారమే మౌనిక హత్య

**ప్రియురాలిని ముక్కలుగా నరికి..**
**రక్తపు వాసన రాకుండా సెంట్ కొట్టి..**
**విశాఖ మౌనిక హత్య కేసులో విస్తుపోయే విషయాలు**





## సహజీవన జంటలకు
# కుటుంబ హోదా

మొదటి పేజి తరువాయి

అడుగుతారు.ఇంకా తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సదుపాయాలు, వంటకు ఉపయోగించే ఇంధనం వంటి అంశాలపై కూడా సమాచారం సేకరించనున్నారు.మన దేశంలో సాధారణంగా ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తారు. చివరిసారిగా 2011లో ఈ ప్రక్రియ పూర్తి అయింది. కోవిడ్-19 ప్రభావంతో 2021లో నిర్వహించాల్సిన జనగణన వాయిదా పడింది. ఇప్పుడు తిరిగి ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమైంది.

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబాయి: భారత ఈక్విటీ సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. సోమవారం నిఫ్టీ 488 పడిపోయి 22,331 దిగువన ముగియగా, సెన్సెక్స్ 1,636 పాయింట్లకు పైగా క్షీణించి 71,948 దిగువన స్థిరపడింది. మార్చి నెలలో, సెన్సెక్స్, నిఫ్టీ రెండూ చెరో 11% పతనమయ్యాయి, దీంతో కోవిడ్ కాలం తర్వాత ఇదే అత్యంత దారుణమైన మార్చి నెలగా నిలిచింది. మార్చి 2026తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి, నిఫ్టీ 5% పైగా క్షీణించగా, సెన్సెక్స్ 7% పడిపోయింది. ఏప్రిల్ 2025 నుండి స్థానిక కరెన్సీ 9.9% క్షీణించడంతో, కరెన్సీ మార్కెట్‌లో భారత రూపాయి గత 14 ఏళ్లలో అత్యంత దారుణమైన ఆర్థిక పత నాన్ని చవిచూసింది.ఇదిలా ఉండగా, యెమెన్‌కు చెందిన హౌతీలు ఇజ్రాయెల్‌పై క్షిపణులను ప్రయోగించడం, అలాగే ఇరాన్ చమురును స్వాధీనం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పడంతో చమురు ధరలు పెరిగాయి. మే డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ 3.2% పైగా పెరిగి బ్యారెల్‌కు వి116.12కు చేరుకోగా, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ఫ్యూచర్స్ 3.4% పెరిగి బ్యారెల్‌కు వి102.96కు చేరుకున్నాయి. మరోవైపు, యూరప్ స్టాక్స్ పడిపోయి, పాన్‌యూరోపియన్ స్టాక్స్ 600 సూచీ 0.3% నష్టంతో ప్రారంభమైనప్పటికీ, నష్టాలను పూడ్చుకుని 0.1% లాభంతో ట్రేడ్ అయింది. ఎఫ్టీఎస్ఈ 100 సూచీ 0.55% పెరగగా, జర్మనీకి చెందిన డీఏఎక్స్ 0.22% నష్టపోయింది.

## తమిళనాడు ఎన్నికలు.. స్టాలిన్, విజయ్ నామినేషన్లు

మొదటి పేజి తరువాయి

అని విజయ్ కోరారు.234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలుజరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో డీఎంకే 164 స్థానాల్లో బరిలో దిగుతోంది. మరో 70 స్థానాలను కాంగ్రెస్ సహా తమ మిత్రపక్షాలకు కేటాయించింది. అటు టీవీకే అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే పలు పార్టీలు తొలి విడత అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి.

## పథకం ప్రకారమే మౌనిక హత్య

అమరావతి, మార్చి 30: విశాఖపట్టణంలోని ఎల్‌వీ నగర్ ప్రాంతంలో మౌనిక (29) హత్య కేసు తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లాక్‌డౌన్ సమయంలో ఇండియన్ నేవల్ షిప్ దేగాలో పనిచేస్తున్న నావికాదళ అధికారి చింతాడ రవీంద్రకు 2021లో డేటింగ్ యాప్ ద్వారా మౌనిక పరిచయం ఏర్పడింది.ఈ పరిచయం క్రమంగా వ్యక్తిగత సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో రవీంద్ర, మౌనికకు సుమారు రూ.3.50 లక్షలు ఇచ్చినట్లు వెల్లడించాడు.అయితే, తర్వాత డబ్బు కోసం మౌనిక తనను తరచూ ఒత్తిడి చేసేదని, ఆమె వేధింపులను తట్టుకోలేక చివరకు హత్యకు పాల్పడినట్లు పోలీసులకు తెలిపాడు.ఆదివారం మధ్యాహ్నం రవీంద్ర ఎల్‌వీ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను పిలిచాడు.ఆమె అక్కడికి చేరుకున్న కొద్ది సేపటికే వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణ క్రమంగా హింసాత్మకంగా మారి,రవీంద్ర మౌనికను దారుణంగా హతమార్చాడు. ఇదిలా ఉండగా,హత్యకు ముందుగానే రవీంద్ర గాజువాకలో కత్తులు కొనుగోలు చేసినట్లు తెలిసింది.హత్య అనంతరం, రక్తపు మరకలను శుభ్రం చేయడంతో పాటు,వాసన రాకుండా ఇంట్లో సెంట్ ఉపయోగించాడు.అనంతరం మౌనిక శరీరాన్ని ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచిపెట్టాడు.తలతో పాటు ఆమె మొబైల్ ఫోన్‌ను దారపాలెం ప్రాంతంలోని తోటల్లో తగులబెట్టినట్లు సమాచారం.ఈ ఘటన తర్వాత రవీంద్ర తన స్నేహితుడికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించాడు. ఆ స్నేహితుడు పోలీసులకు లొంగిపోవాలని సూచించడంతో, చివరకు రవీంద్ర గాజువాక పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈకేసు ప్రస్తుతం విశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## భెల్ కాంట్రాక్టు కార్మికునికి విరాళం



-గాజువాక : పాత గాజువాక జంక్షన్‌లో ఇటీవల ప్రమాదానికి గురై విధులకు రాని బి.నరసింహమూర్తి, అనారోగ్యంతో గత కొన్ని నెలల నుంచి డ్యూటీకి హాజరుకాని బి.రవికుమార్‌కు భెల్ ఉద్యోగులు పలువురు విరాళం అందజేశారు. వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి విరాళాలు సేకరించగా రూ.26 వేలు వచ్చాయి. ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున సోమవారం ఆయా కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భెల్ సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్, కె.నారపరెడ్డి, ఎస్.జగన్నాధరావు, వి.సురేష్, ఎంవి.చలపతి అందజేశారు.

# ఇక నక్సల్స్ రహిత భారత్

మొదటి పేజి తరువాయి

చేయలేకపోయారు? అని ఆయన ప్రశ్నించారు.ఈ అంశాన్ని చారిత్రక నేపథ్యంలో వివరిస్తూ, ఒకప్పుడు బిర్సా ముండా, తిలకా మాంఝీ, రాణి దుర్గావతి వంటి నాయకుల స్ఫూర్తితో వెలిగిన గిరిజనవర్గాలు, పాలనాపరమైన లోపాల కారణంగా మావోయిస్టు భావజాలం వైపు ఆకర్షితులయ్యాయని అమిత్ షా అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనులను ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 75 ఏళ్లలో.. కాంగ్రెస్ 60 ఏళ్లు పాలించిందని, ఇంతకాలం గిరిజనవర్గాలు ఎందుకు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయని ఆయన ప్రశ్నించారు.దేశం నక్సల్ రహిత భారతంగా మారేరోజు దగ్గరలో ఉందని హోంమంత్రి స్పష్టంచేశారు. మోదీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇప్పుడు మారుమూల గ్రామాలకు కూడా చేరుతున్నాయని అన్నారు. ప్రస్తుతం గ్యాస్, రేషన్, తాగునీరు, పాఠశాలలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. భద్రత విషయంలో తగ్గేది లేదని, ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వమని, ఇంకా ఆయుధాలు వీడని నక్సలైట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని స్పష్టం చేశారు.'మీరు రాజ్యాంగాన్ని తిరస్కరించి ఆయుధాలు చేపట్టలేరు. దీనిని సహించబోం' అని అమిత్‌షా వివరించారు. మోదీ ప్రభుత్వం చర్చలకు, సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, సాయుధ ఉద్యమాలు షరతులు విధించడానికి లేదా అడ్డంకులు సృష్టించడానికి అనుమతించబోమని ఆయన తెలిపారు. ఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారని, వారి అజెండాలో అభివృద్ధి లేదని, కేవలం ఉనికి కోసమే పోరాడరని మండిపడ్డారు. నక్సలైట్లను భగత్‌సింగ్, బీర్సాముండాలతో పోల్చొద్దని వ్యాఖ్యానించారు.సల్వాజుడుం కేసు తీర్పుపై ఖండనసల్వాజుడుం కేసులో 2011లో వచ్చిన సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఖండిం చారు. ఆ తీర్పు ఇచ్చిన జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డిని ప్రతిపక్షాలు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడాన్ని ఆయన విమర్శించారు. ఆ తీర్పుతో ఆ తర్వాత సల్వాజుడంతో సంబంధం ఉన్నవారిని నక్సలైట్లు లక్ష్యంగా చేసుకుని చంపేశారని ఆయన అన్నారునక్సలైట్లతో కేంద్రం చర్చలు జరపాలంటూ నిన్నమొన్నటి వరకు 'అర్బన్ నక్సల్స్' వాదించారని, గత ఆరు రోజుల్లో తను 2,000 వేల వ్యాసాలను సమీక్షించానని తెలిపారు. వాటిలో మావోయిస్టులకు వంతపాడడమే ఉందన్నారు. నక్సలిజానికి కాంగ్రెస్ మద్దతుగా నిలిచిందని చెప్పారు. తెలంగాణలో గుమ్మడి విఠల్ (గద్దర్)ను రాహుల్ గాంధీ కలిశారని, అర్బన్ నక్సల్స్‌తో ప్రతిపక్ష నేతకు సంబంధాలు ఉన్నాయన్నారుఅజ్ఞాతంలో ఆరుగురు: డీజీపీ శివధర్‌రెడ్డి ఇంకా అజ్ఞాతంలో ఆరుగురు మావోయిస్టులు ఉన్నారని, వారు, వారి కేడర్ అంతా ఇప్పటికైనా ఆయుధాలు వీడాలని, జనజీవనస్రవంతిలోకి రావాలని, కుటుంబాలతో కలిసి ఉండాలని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు డీజీపీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులను వారిని ఆయా కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రోత్సహించాలని, శాంతిమార్గాన్ని అనుసరించేలా చైతన్యం చేయాలని కోరారు.జన జీవన స్రవంతిలో కలిసే వారందరికీ భద్రత, గౌరవం, కొత్త జీవితానికి అవసరమైన అన్ని సహాయాలను అందించడంలో తెలంగాణ పోలీసులు కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. హింసామార్గాన్ని విడిచిపెట్టి రాష్ట్ర అభివృద్ధి, శాంతిలో భాగస్వాములు కావాలని తెలంగాణకు చెందిన, ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో వివిధ మావోయిస్టు కేడర్లలో పనిచేస్తున్న వారికి సూచించారు.ముప్పాల్ల లక్ష్మణరావు అలియస్ గణపతి(జగిత్యాల జిల్లా), పుసునూరి నరహరి అలియాస్ సంతోష్ (హనుమకొండ మండలం), వర్త శేఖర్ అలియాస్ మంగ్తు (సికింద్రాబాద్), జోడే రత్న బాయి అలియాస్ సుజాత(గద్వాల జిల్లా), నక్క సుశీల అలియాస్ రేలా (హైదరాబాద్), రంగబోయిన భాగ్య అలియాస్ రూపి (సిద్దిపేట జిల్లా) అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. గత రెండు సంవత్సరాలలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరికి సమగ్ర పునరావాస పథకం కింద ఆర్థిక సహాయం, ప్రయోజనాలు అందజేశామని వెల్లడించారు.

# 2029 కల్లా అందరికీ ఇళ్లు

మొదటి పేజి తరువాయి

లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారు ముక్కర అంబిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. మరో లబ్ధిదారు షేక్ నూరి కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయం ప్రకారం గృహప్రవేశంలో పాల్గొన్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ రెండు కుటుంబాలకు చెందిన సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించి, టిడ్కో స్వాధీన పత్రాలను అందించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ గృహప్రవేశాలకు రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం 'ప్రజావేదిక' బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత 30 ప్రాంతాల్లో 2,50,983 టిడ్కో గృహాలను పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయం తెలుసుకుని మెరుగైన పాలన అందిస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. గత పాలకులు మూడు ముక్కలాటతో రాజధానిని ముక్కలు చేశారని, అందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు.పైపు ద్వారా గ్యాస్ సరఫరాదీపం 2.0 కింద మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామని, భవిష్యత్తులో పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేస్తామని చంద్రబాబు తెలిపారు. పైప్‌లైన్ ద్వారా ఎలా తాగునీరు వస్తుందో, అలాగే గ్యాస్‌నూ పైప్‌ల ద్వారా అందుబాటులోకి తెస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇవ్వాల్సి ఉన్నా, గత పాలకులు నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకాన్ని కొనసాగించేలా చేసి ప్రతి ఇంటికీ నీరందిస్తామన్నారు. ఇంటిపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకొని సొంతంగా విద్యుత్ తయారు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ఉచిత విద్యుత్తు కొనసాగిస్తామన్నారు. 63 లక్షల మంది పేదలకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మహిళా దినోత్సవం నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేయాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల కల్లా మహిళా రిజర్వేషన్ వస్తుందని, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు.తీరప్రాంతంలో గస్తీ పెంచండిరాష్ట్రంలోని మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పొరుగు రాష్ట్రాల మత్స్యకారులు అక్రమంగా మన రాష్ట్రంలోకి చేపల వేటకు రాకుండా తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు సంయుక్త చర్యలతో కట్టడి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. మన తీరప్రాంత మత్స్య సంపద మన ప్రాంత మత్స్యకారులకే దక్కాలని, తమిళనాడు, పుదుచ్చేరి నుంచి వచ్చే వాళ్లను వేట చేసుకోనీయబోమన్నారు. పొరుగు రాష్ట్ర మత్స్యకారులు మన పరిధిలోకి రాకుండా తీర ప్రాంతంలో నిఘా పెడతామని తెలిపారు.స్థానిక మత్స్యకారులకు అన్యాయం జరగకుండా ముఖ్యమంత్రిగా తనది బాధ్యతన్నారు. తీర ప్రాంత నిఘాను గత వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. నిఘా కోసం గతంలో తాము 12 బోట్లను ఏర్పాటు చేశామన్నారు. వైసిపి ప్రభుత్వం వీటిని పక్కన పెట్టేసి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నిఘా కోసం తక్షణమే రెండు బోట్లను కొనుగోలు చేస్తామన్నారు. ఒక్కొక్క బోటు విలువ 1.50 కోట్ల వరకూ ఉందని తెలిపారు. అవసరమైతే మరిన్ని నిఘా బోట్లను కొనుగోలు చేస్తామన్నారు. మత్స్యకారుల సేవా పథకం ద్వారా మత్స్యకార జీవన భృతిని రూ.20 వేలకు పెంచామని తెలిపారు. మత్స్యకారుల పొట్టగొడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 217 ఒఒను రద్దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, టిడ్కో ఎమ్‌డి అజరుజైన్ పాల్గొన్నారు.

# కల్తీ నియంత్రణకు కఠిన వ్యవస్థ

మొదటి పేజి తరువాయి

మద్దతు ధర చట్టం తెచ్చిందన్నారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిందని, కానీ అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లారని, అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందన్నారు.దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్పా పేదలకు ఉపయోగపడటం లేదని గ్రహించామని, అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించి సన్నవడ్లు పండించాలని ప్రోత్సహించామని అన్నారు. రాష్ట్రం లో 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు.భవిష్యత్తులో ఇది 90 శాతం కూడా కావచ్చునని పేర్కొన్నా రు. సన్న బియ్యం కోసం ఏడాదికి రూ.14,560 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్ రూపంలో అదనంగా ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చ చేస్తున్నట్లు చెప్పారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని, పౌరసరఫరాల మంత్రి, శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైందని కొనియాడారు.నేటితో సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు అసెంబ్లీలో సన్నబియ్యం భోజనం పెట్టామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. వరి ఉత్పత్తిలో తెలంగాణలో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నదని సీఎం తెలిపారు. ఇప్పుడు వరి ఒక్కటే కాకుండా ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ఒక్కో పంటను ఎక్కువగా రైతులు పండిస్తున్నారని, ఇంకా ఎక్కువగా ఉత్పత్తి జరిగితే ఇతర రాష్ట్రాల నుంచి ఆధారపడకుండా ఉంటుందని, తద్వారా భవిష్యత్‌లో వీటన్నింటిని రేషన్ షాపుల ద్వారా ఇవ్వడానికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఈ దళారీ వ్యవస్థకు చరమగీతం పాడి, రైతులకు సరైన న్యాయం చేసేందుకే తాము కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకువచ్చామని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడంపై కూడా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే పెద్ద నేరమని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే అక్రమ నిల్వదారులను వదిలిపెట్టబోమని సీఎం స్పష్టం చేశారు.కేసీఆర్‌తోనే నాకు గుర్తింపు'రావణుడు ఉంటేనే రాముడి గొప్పతనం ప్రజలకు తెలిసింది. శకుని లేకుంటే కృష్ణుడికి గుర్తింపు వచ్చేదా..? అట్లనే కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు వచ్చింది ' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు జనానికి తెలిసేవి కావన్నారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అంతా అనుకుంటున్నారని, కానీ ఆయనను కేటీఆర్, హరీశ్‌రావు కలిసి గృహ నిర్బంధం చేశారనే అనుమానం కలుగుతుందని వ్యాఖ్యానించారు.కేసీఆర్‌తో తనకు పోలిక లేదని, ఆయన వరి వేస్తే ఉరే అన్నాడు.. తాను మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నానని చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాలనాగు కంటే ప్రమాదకరమని వ్యాఖ్యానించా రు. కాగా పార్టీ ఆదేశాల మేరకు కేరళలో రెండు ప్రచారానికి వెళ్లనున్నట్లు తెలిపారు. డీలిమిటేషన్‌తో దక్షిణాదికి తీరని నష్టం పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజనతో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఎంపీ ల సంఖ్య చాలా వ్యత్యాసం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడున్న ఎంపీల సంఖ్యకు 50 శాతం సీట్లు పెంచితే దక్షణాదికి, ఉత్తరాది రాష్ట్రాల మధ్య 410 ఎంపీ సీట్లు గ్యాప్ వస్తుందని వివరించారు. దక్షిణాదిలో 130 ఎంపీ సీట్లు ఉన్నాయని, వీటిలో 50 శాతం అంటే అదనంగా 65 సీట్లు పెరుగుతాయన్నారు. పెరిగిన సీట్లతో మొత్తం దక్షిణాది లో 195 సీట్లే ఉంటాయన్నారు.ఉత్తరాదిలో ప్రస్తుతం 412 ఎంపీ సీట్లు ఉన్నాయని, వీటిలో 50 శాతం అంటే 206 సీట్ల పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుతమున్న ఎంపీ సీట్లు, పెరిగిన సీట్లతో కలిపి మొత్తం 618 ఎంపీ సీట్లు అవుతాయన్నారు.

## ట్రంప్ లక్ష్యం యురేనియం!?

వాషింగ్టన్, మార్చి 30: ఇరాన్‌లో ఉన్న యురేనియమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యూహం పనునతున్నట్లు తెలుస్తుంది. ఆ దేశంలోని సుమారు 400 కిలోల యురేనియాన్ని స్వాధీనం చేసుకోవడానికే అగ్రరాజ్యం గ్రౌండ్ ఆపరేషన్‌కు సిద్ధమైనట్లు కన్పిస్తుంది. అందుకే ఇరాన్‌లో భూతల దాడులకు దిగాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం 31వ రోజుకు చేరుకుంది.ప్రజల వ్యతిరేకత, రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక నష్టాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ యుద్ధం నుంచి వెనక్కు తగ్గారు. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధం అయ్యారు. అయితే, అమెరికా తో చర్చలు జరిపేందుకు ఇరాన్ సుముఖత వ్యక్తం చేయటం లేదు. ఈ మేరకు ఇరాన్ నాయకులు బాహాటంగానే ప్రకటనలు ఇ చ్చారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్ ఇకపై న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేయకుండా ఉండేలా మాస్టర్ ప్లాన్లు వేస్తున్నారు.న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేయడానికి ఇరాన్ సిద్ధం చేసిపెట్టుకున్న దాదాపు 970 పౌండ్ల(400కేజీలు) యురేనియాన్ని స్వాధీ నం చేసుకోవాలని చూస్తున్నారు. ఇరాన్ దగ్గర 60 శాతం హైలీ ఎన్‌రిచ్డ్ యురేనియం 400 కేజీలు ఉంది. 20 శాతం ఫిస్సైల్ మెటీరియల్ 200 కేజీలు ఉంది. 60 శాతం హైలీ ఎన్‌రిచ్డ్ యురేనియంను ట్రంప్ టార్గెట్ చేశారు. అమెరికాకు చెందిన ఓ ప్రముఖ మీడియా కథనం ప్రకారం.. ఇరాన్ దగ్గర న్యూక్లియర్ మెటీరియల్ ఉండకూడదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్‌తో చర్చలు జరిపి యురేనియాన్ని తీసుకోవాలని చూస్తున్నారు.ఇరాన్ తమ ప్రతిపాదనకు అంగీక రించకపోతే.. బలవంతంగానైనా యురేనియాన్ని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ చూస్తున్నారు. అయితే పాకిస్థాన్ వేదికగా ప్రస్తుతం అమెరికా, ఇరాన్ దౌత్యవేత్తల మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయి, ఒకవేళ అన్నీ సజావుగా సాగితే అమెరికా తన భూతల దాడి ప్లాన్‌ను విరమించే అవకాశాలు ఉన్నాయి. ఇరాన్ చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ దీవిని కూడా స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచనలో అమెరికా ఉన్నట్లు స్పష్టమవుతున్నది. ఇరాన్‌లో ఎన్నో కీలకమైన టార్గెట్లను ధ్వంసం చేశామని, తమ మిలిటరీ ఆ పని చేసినట్లు ఆయన తన ట్రూత్ సోషల్ పోస్టులో వెల్లడించారు.తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైందని, చాలా ప్రమాదకరమైందని, దేవుడు మిమ్మల్ని దీవిస్తాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. మరోపక్క ఇరాన్ దగ్గర ఉన్న యురేనియాన్ని స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ఆలోచన ప్రమాదకరమైనదని అమెరికాకు చెందిన మాజీ సైనికాధికారులు అంటున్నారు. ఒకవేళ అమెరికా యురేనియాన్ని స్వాధీనం చేసుకోవడానికి వెళితే ఇరాన్ నుంచి మరింత ఉధృతంగా దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ చర్యల వల్ల యుద్ధం మరిన్ని రోజులు కొనసాగుతుందే తప్ప ఆగదని స్పష్టం చేస్తున్నా రు. ట్రంప్ ప్లాన్ తీవ్ర ప్రమాదంతో కూడుకున్నదని, దానికి రోజులు, వారాల సమయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

## రోడ్డు సమస్యలపై వినతులు

విశాఖ :జివిఎంసి గాజువాక ఆరో జోన్ 71వ వార్డు పరిధిలోని ఆటోనగర్ డి బ్లాక్ తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 56/2లోగల రోడ్డు సరిహద్దులు గుర్తించి రోడ్డు మార్గానికి సుగమం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి సోమవారం పలు అపార్టుమెంట్ల వాసులు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను తెలియజేశారు. గాజువాక మండలం తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 55/2లో ఆటోనగర్ డి బ్లాకు పరిధిలో సమైక్య అపార్ట్‌మెంట్ 95 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి రెసిడెన్సీ 50 ఫ్లాట్‌లు, సిరి ఎన్‌క్లేవ్ 20 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి ఎన్‌క్లేవ్ 90 ఫ్లాట్‌లు, గ్రీన్‌లైఫ్ అపార్ట్‌మెంట్ ఎ, బి బ్లాకులు 80 ఫ్లాట్లల్లో కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఇదే ప్రాంతంలో మరో 50 కుటుంబాల వారూ ఉన్నారన్నారు. వెరసి రెండు వేల మంది జీవిస్తున్నారన్నారు. వారందరూ ఉపయోగించే రోడ్డుకు సరిహద్దులను రెవెన్యూ శాఖ వారు నిర్దేశించినా, ఆక్రమణదారుల గుప్పెట్లో ప్రభుత్వ భూమి (రోడ్డు) ఉందన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం సరిహద్దులు గుర్తించి, రోడ్డు మార్గం సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆయా అపార్టుమెంట్ల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు జె.రామన్న, కెఎస్.చౌదరి, శంకరరావు, గౌరవ్, ఎం.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరాజు, పి.కృష్ణారావు, శివకుమార్, పి.శ్రీనివాసరెడ్డి, శ్రీధరన్, ఆర్.జగన్మోహన్, పిజె.రాముడు, వివిఎల్‌కె.రావు, బి.కోటిరెడ్డి పాల్గొన్నారు

## ఘనంగా జరిగిన బ్రిలియంట్ మైండ్స్ ప్లే స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు:




(ప్రజాస్వామ్యం) విజయనగరం:పట్టణం లో రింగ్ రోడ్డు, నటరాజ్ కాలనీ దగ్గరలో ఉన్న బ్రిలియంట్ మైండ్స్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు స్థానిక ఆర్య ఫంక్షన్ హాల్ ,మయూరి టిఫిన్స్ దగ్గర ఘనంగా జరిగాయి.ఇందులో భాగం గా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, అట, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి.అనంతరం ఈ విద్యాసంవత్సరం లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ లెంక బిందు ప్రియ, లెంక వెంకట రమణ, లెంక భవాని, పాఠశాల టీచర్లు మరుపల్లి స్వర్ణ, రామలక్ష్మి లు పాల్గొన్నారు..

## రామాలయానికి రూ.25 వేల విరాళం



ప్రజాస్వామ్యం ,విజయనగరం :ప్రముఖ పారిశ్రామిక వేత్త ,ఉత్తమ పౌర పురస్కార గ్రహీత,కీర్తిశేషులు గురాన సాధూరావు 10వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. చిల్ల పేట గ్రామంలో శ్రీ రామాలయ పునర్నిర్మాణం కోసం రూ. 25,000/- విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. సాధూరావు జ్ఞాపకార్థం వారి కుటుంబం చేసిన ఈ ఆర్థిక సాయాన్ని గ్రామస్థులు, భక్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

## నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

### -సర్పంచ్ కిషన్ నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్



పర్వతగిరి, ప్రజాస్వామ్యం మార్చి 30: పర్వతగిరి మండలం ఏబీ తండా గ్రామ పంచాయతీ బోటికాడి లో నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సర్పంచ్ కిషన్ నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్.ఈ కార్యక్రమం గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో మైలురాయి అని అన్నారు.శనివారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రంలో సర్పంచ్ కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలు స్వచ్ఛమైన తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న సందర్భం లో వాటర్ ప్లాంట్ ప్రోపరేటర్ భూక్యా రవి నాయక్ మంచి ఆలోచనతో ఈ నూతన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించడం మంచి ఆలోచన అని గ్రామ పంచాయతీ లో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతా నెక్కొండ సర్పంచ్ రవి యాదవ్, పెద్దలు గొర్ల సాంబయ్య, రాజన్న, శ్రీను, అనిల్, రాజేందర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై యువకుడు మృతి

### ఎస్.ఐ - కే.కిరణ్ కుమార్ నాయుడు



ప్రజాస్వామ్యం / గజపతినగరం: గజపతినగరం జాతీయ రహదారిపై గల జంక్షన్ లో విద్యుత్ షాక్ తో ఒక యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది . స్థానిక సాయి నావాల్టీస్ షాపు నుంచి రోడ్డు అవతలి వైపుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని చుట్టుపక్కల వాళ్ళు తెలియజేశారు. మృతుడు ఆకుల ఏడుకొండలు(18) గజపతినగరం మండలం తుమ్మకాపల్లి గ్రామానికి చెందిన యువకుడు. విద్యుత్ షాక్ కు గురైన ఏడుకొండలను స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కానీ అప్పటికే ఏడుకొండలు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యుత్ షాక్ తో ఏడుకొండలు మృతి చెందడంతో స్వగ్రామమైన తుమ్మకాపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి . కుటుంబ సభ్యుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# గురుప్రసాద్‌కు తెలుగు స్వర్ణ నందీ పురస్కారం

ప్రజాస్వామ్యం ,విజయనగరం :రాజమహేంద్రవరంలో జరిగిన జాతీయ సాంస్కృతిక వైభవోత్సవంలో శ్రీనాథ కవిసార్వభౌముని 13వ తరం వారసులు కావూరి శ్రీనివాస శర్మ చేతుల మీదుగా విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, సాహితీవేత్త సముద్రాల గురుప్రసాద్ తెలుగు స్వర్ణ నందీ పురస్కారాన్ని స్వీకరించారు. తెలుగు సాహిత్యంలో విశేష కృషితో పాటు,తెలుగు భాష పరిరక్షణ కోసం చేస్తున్న కృషికి గాను పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో భక్త రామదాసు 10వ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు, కవయిత్రి మొల్ల 14వ తరం వారసులు మున్నెల్లి శివశంకరయ్య, పిఠాపురం సంస్థాన రాజవంశీకులు రాజారావు వేంకట మహీపతి రామరత్నరావు బహద్దూర్, మాజీ పార్లమెంటు సభ్యులు మిడియం బాబూరావు,



శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి పనులను గడువులోపు పూర్తి చేయాలి

### ఏజెన్సీ ప్రాంత రహదారి పనుల్లో ఉదాశీనత పనికిరాదు
### జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 30 : ఏజెన్సీ ప్రాంత రహదారి పనులను ఉదాశీనత పనికిరాదని, గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం డోలి రోడ్ల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పనుల్లో జాప్యం పనికిరాదని, మెటీరియల్ సరఫరాలో లోపాలు లేకుండా కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. డెత్ వర్క్ ఫార్మేషన్, రోలింగ్, కాంపాక్షన్ పనులు పూర్తయినప్పటికీ, లేయర్ పనులు ఇంకా పూర్తికాకపోవడం పట్ గ్రౌండ్ లెవల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ద వహించాలని అన్నారు. ఈ పనులన్నీ వచ్చే నెల 10వ తేదీలోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముందస్తు ప్రణాళికతో మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా నిరంతరం ఫీల్డ్‌లో ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజూ పనుల పురోగతికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించి, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ లో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి

### అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి
### జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 30 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు, నాణ్యతతో పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలతతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఇందులో 111 అర్జీలు అందగా, వాటిలో 25 రెవిన్యూ శాఖవి కాగా, ఇతర శాఖలకు చెందినవి 86 అందాయని అన్నారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందన్నారు. ప్రజా సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని అన్నారు. వివిధ శాఖలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ఆ సమస్య పునరావృతం కాకుండా అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్లోని వివిధ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వరం సంగివలస దివిస్ పార్క్...

### కోట్ల రూపాయలతో పార్కు నిర్మించారు ఏటా నాలుగు లక్షలతో అభివృద్ధి పనులు



తగరపువలస ప్రజాస్వామ్యం స్థానిక సంగివలస చెరువు ఆధునీకరణ చేసి పోలమాంబ ఆలయం పార్కు నిర్మించి ప్రజలకు యాజమాన్యం ఆహ్లాదం కల్పించింది. దివిస్‌కోట్ల రూపాయలతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్. సిట్టింగ్ సౌకర్యాలు కల్పించడం స్థానికులు కుటుంబాలతో వెళ్లి ఆనందం అనుభవిస్తున్నారు. పిల్లలు ఆడుకునే సౌకర్యం యువకులు వ్యాయామ పరికరాలు కల్పించారు.పోలమాంబ ఆలయం పరిసరాలు శుభ్రం చేసి చెట్లు కింద కూర్చుంటే స్వర్గం కనిపిస్తుంది. దివిస్ వలన చెరువు కి మంచి అందం లభించింది. ముఖ్యంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ లో ప్రతి రోజు వేలమంది నడచి ఆనందం పొందుతున్నారు. చెరువు పక్కనుంచి నడక తెలియని అనుభూతి కల్పిస్తుంది. ప్రతి ఏడాది నాలుగు లక్షల వరకు వెచ్చించే చెరువు శుభ్రం పార్కులు మెయింటైన్స్ జరుగుతోంది. ప్రజలు సహకరిస్తే చాలా సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నారు.

# ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల మధ్య ఘర్షణ

### ఇద్దరికీ తీవ్ర గాయాలు , ఆసుపత్రికి తరలింపు
### ఎస్.ఐ - యు మహేష్

ప్రజాస్వామ్యం - బొండపల్లి, (గజపతినగరం) :

బొండపల్లి మండలం లోని కొండకిండాం గ్రామంలో ఆస్తి పంపకాలకు సంబంధించి అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో తమ్ముడు కలిసెట్టి గౌరినాయుడు , ఇద్దరు అన్నయ్యలు కలిసెట్టి సత్యనారాయణ, కలిసెట్టి బంగారు నాయుడులపై కత్తితో దాడి చేశాడని ఎస్.ఐ యు .మహేష్





విలేకరులకు తెలియజేశారు. ఆస్తి పంపకాలలో వ్యత్యాసాలే ఈ దాడికి కారణమని ఎస్.ఐ యు మహేష్ చెప్పారు.ఈ సందర్భంగా ఎస్.ఐ యు.మహేష్ మాట్లాడుతూ దాడిలో తీవ్ర గాయాలైన ఇద్దరు వ్యక్తులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా, ఆసుపత్రిలో చికిత్స జరుగుతుందని తెలియజేశారు. దాడి చేసిన కలిసెట్టి గౌరినాయుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యు.మహేష్ తెలియజేశారు.

## ఘనంగా అంజిబాబు జన్మదిన వేడుకలు

### -శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు



హైదరాబాద్ ప్రజాస్వామ్యం మార్చి 30:సీనియర్ జర్నలిస్టు అంజిబాబు నాగుల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో జర్నలిజంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఆయనకు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా మిత్రులు,ఆత్మీయులు అంజిబాబుతో కేకు కట్ చేయించి వేడుక జరిపారు. నిండునూరేళ్లు ఆరోగ్యంగా,ఆనందంగా జీవించాలని కోరుకుంటూ అభినందించారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, జానపద విభాగం డీన్ విజయ్ పాల్, జర్నలిజం అధ్యాపకులు డా.షేక్ హసీనా, షేక్ షమీర్, గోపాల్ ఇతర పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు అందుకున్నారు. అందరితోనూ ఆత్మీయంగా, కలివిడిగా ఉండే అంజిబాబుకు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. "స్నేహశీలి, అనుబంధం ఆత్మీయతలు కలగలసిన స్వచ్ఛమైన ప్రేమ ఆప్యాయతలు పంచే నిత్యసంతోషి సోదరుడు అంజిబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఆ దేవుని ఆశీస్సులు నిత్యం నీపై ఉండాలని,నీ చదువులో, వృత్తిలో, పని పాటల్లో విజయాలను ఆస్వాదిస్తూ అనేక పుట్టినరోజులు సుఖసంతోషాలతో జరుపుకోవాలని,మీ కుటుంబం ఫలించి విస్తరించాలని, దేవుని కృప నిండుగా మీకు ఉండాలని ఆశిస్తున్నా.." అంటూ న్యాయవాది, జర్నలిస్టు మిత్రుడు కొండూరి కోటిబాబు, "హ్యాపీ బర్త్డే ఏఅంజిబాబు ఎంసిజె అన్నయ్య" అంటూ లవన్‌కుమార్, "మెనీ మోర్ హ్యాపీ రిటర్న్స్ అఫ్ ది డే అంజిబాబు సార్ .." అంటూ జర్నలిజం మిత్రురాలు వై.నదియా,"మంచోడు, మృధు స్వభావి, సెల్ఫీ స్టార్ అంజిబాబు బ్రదర్ కు హ్యాపీ పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ తెలుగుప్రభ డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ ప్రశాంత్, అలాగే.. స్నేహశీలి.. స్వచ్ఛమైన మనసు.. మనిషి అయిన అంజిబాబుకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు అంటూ ఇతర మిత్రులు,ఈనాడు,ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణకు చెందిన కొందరు జర్నలిస్టు మిత్రులు అంజిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మిత్రుడు, వివేకానంద్ నగర్‌లోని ఏరువాక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు అనిల్ అంజిబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. -మీ ప్రేమాభిమానాలకు హృదయపూర్వక ధన్యవాదాలునా పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు. నాపై మీరు చూపే ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞుడిని, మీ ఆశీస్సులు, దీవెనలు, నాపై ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను.. అంటూ జర్నలిస్టు అంజిబాబు నాగుల అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### శిర్లపాలెంలో వైభవంగా
## శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ట

### ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరమ్మ



ఆనందపురం, ప్రజాస్వామ్యం భీమిలి నియోజకవర్గం, ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో సోమవారం శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న సిరమ్మ , ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు.ఈ కార్యక్రమం లో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, ఎంపీపీ ప్రతినిధి మజ్జి వెంకట్రావు, ఎస్. అప్పలరాజు, మాజీ సర్పంచ్, వైఎస్ఆర్సిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా జరిగిన బ్రిలియంట్ మైండ్స్ ప్లే స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు:

( న్యూస్ టైమ్స్ ) విజయనగరం:

పట్టణం లో రింగ్ రోడ్డు, నటరాజ్ కాలనీ దగ్గరలో ఉన్న బ్రిలియంట్ మైండ్స్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు స్థానిక ఆర్య ఫంక్షన్ హాల్ ,మయూరి టిఫిన్స్ దగ్గర ఘనంగా జరిగాయి.ఇందులో భాగం గా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, అట, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి.అనంతరం ఈ విద్యాసంవత్సరం లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ లెంక బిందు ప్రియ, లెంక వెంకట రమణ, లెంక భవాని, పాఠశాల టీచర్లు మరుపల్లి స్వర్ణ, రామలక్ష్మి లు పాల్గొన్నారు..

# తెలుగు ఆత్మగౌరవానికి ప్రతిబింబం తెలుగుదేశం

### ఆవిర్భావ సమావేశంలో గంటా

భీమునిపట్నం, ప్రజాస్వామ్యం తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ ఎన్టీఆర్ సంక్షేమ పథకాలకు ఆద్యుడని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం సందర్భంగా ఆదివారం భీమిలి పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగుర వేసిన అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 2 కిలో బియ్యం, పక్కా ఇళ్లు, పెన్షన్ వంటి పథకాలను 44 ఏళ్ల కిందటే పేద ప్రజలకు అందించిన ఎన్టీఆర్ ను కారణజన్ముడిగా అభివర్ణించారు. సీఎంగా పని చేసిన టి.అంజయ్యను రాజీవ్ గాంధీ అవమానించిన తీరుకు ఎన్టీఆర్ ఆవేదన చెందారన్నారు. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వర స్వామి తదితర పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరైన ఎన్టీఆర్ ను తెలుగు ప్రజలు దేవుడిగానే చూస్తారని తెలిపారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు.. అనే నినాదంతో పార్టీ పెట్టిన 9 నెలల్లో వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించారన్నారు. పేద ప్రజలకు కూడు.. గూడు.. గుడ్డ.. అందించడమే తెలుగుదేశం సిద్ధాంతమని తెలియజేసి.. ప్రజల్లోకి వెళ్లి వారి ప్రేమాభిమానాలను చూరగొన్నారని వివరించారు. సీనియర్ నాయకులను సన్మానించుకోవాలని.. సైకిళ్లపై ర్యాలీ చేయాలని.. పార్టీ ఆవిర్భావ వేడుకలను వినూత్నంగా నిర్వహించిన గంటా రవితేజను అభినందించారు. ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోస్తున్న సీనియర్ కార్యకర్తలను శాలువా కప్పి సన్మానించారు. మెమెంటో బహుకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా రవితేజ, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు వెంకటప్పడు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, బి.ఆర్.బి. నాయుడు, మొల్లి లక్ష్మణరావు, పీవీ నరసింహం, పిల్లా వెంకట్రావు పాల్గొన్నారు.



# ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులు ప్రారంభం



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం స్థానిక శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో, భీమిలి ఇండోర్ స్టేడియం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులను టీడీపీ యువ నాయకులు, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంటా రవితేజ పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ స్టేడియంలో సరైన వసతులు లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవడంతో గంటా రవితేజ చొరవతో, స్థానిక కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి సహకారంతో జీవిఎంసి మరియు స్పోర్ట్స్అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ల అనుమతులతో స్టేడియం పునరుద్ధరణ పనులను ఆదివారం ప్రారంభించారు. పునరుద్ధరణలో భాగంగా ఇండోర్ షటిల్ బాడ్మింటన్ కోర్టుకు సింథటిక్ మ్యాట్, సెంట్రల్ లైటింగ్ మరియు ఇతరత్రా మరమ్మత్తుల కోసం క్రీడాభిమానులు, దాతలు మరియు శిక్షణ పొందుతున్న పిల్లల తల్లి దండ్రుల సహకారంతో ముందుకు వెళుతున్నామని భీమిలి ఇండోర్ స్టేడియం అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా శశి విద్యా సంస్థల మేకా నరేంద్ర సహకారంతోనే ఈ పునరుద్ధరణ పనులు ప్రారంభించగలిగామని అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, పుర ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, భీమిలి ఇండోర్ స్టేడియం అసోసియేషన్ అధ్యక్షుడు కారి ఈశ్వరరావు, కోచ్ ఫాల్గుణ, సభ్యులు కాళ్ళ సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్, వర్మ, అనిల్, ప్రతాప్, కనకరాజు, శివశంకర్, రాజేష్, హేమరాజు, కిరణ్, శ్రీనివాసరావు, యోగేష్, శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమునిపట్నం టౌన్ ప్రయివేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ అసోసియేషన్ సభ్యులు ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా భీమిలి ఎన్ జీ ఓ భవనం వేదికగా సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులు డి.వి.సత్యనారాయణ (అధ్యక్షులు) కె. శ్రీహరిరావు ( ప్రధాన కార్యదర్శి) కె పాల్ రాజు ( ఉపాధ్యక్షులు) ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సర్వే యాత్ర చేపట్టినట్లు వివరించారు. ఇచ్చాపురం నుంచి ప్రారంభించిన ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను, మండలాలను సందర్శించడం, ప్రయివేటు ఎలక్ట్రికల్ ఒ ప్లంబర్ల వివరాలు సేకరించడం వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సర్వే యాత్ర అనంతపురం జిల్లావరకు కొనసాగనుందని, అనంతరం బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్లను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి టౌన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ తోపాటు అసోసియేషన్ అధ్యక్షులు కనకల సన్నిబాబు, సెక్రటరీ రమణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీలో రగడ పట్ల గంటా సీరియస్

### విచారణకు త్రిసభ్య కమిటీ



ప్రజాస్వామ్యం భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలో తెలుగుదేశం నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో మాట మాట పెరిగి పార్టీలోని కనకల సూరిబాబు, బోని రమణ, కె. వెంకట ఆదినారాయణ, బోని సురేష్ లు.. కనకల వెంకటరమణ, మొకర శంకర్రావు, బోని దుర్గారావు, మొకర శ్రీనులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. దీనిపై రెండు వర్గాల నేతలకు షోకాజ్ నోటీసులివ్వాలని గంటా ఆదేశించారు. ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, పద్మనాభం మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ, పార్టీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావులతో కూడిన త్రిసభ్య కమిటీ విచారించి నివేదిక అందించాలన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిని ఉపేక్షించేది లేదని.. పార్టీ నియమావళిని అనుసరించి చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

## అహూతులను అలరించిన పౌరాణిక ఘట్టాలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమిలి కళాసాహితి నిర్వహణలో ఆదివారం వాసవి కళ్యాణ మండపం లో 3 గంటల పాటు ప్రదర్శించిన పౌరానిక నాటకాల ఘట్టాలు అహూతులను అలరించాయి. రామాంజునేయ యుద్ధం, సత్య హరిచంద్ర గాయోపాక్యానం లలో ముఖ్య ఘట్టాలను మూడు గంటల పాటు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాసాహితీ అధ్యక్షులు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ అధ్యక్షత వహిస్తూ ఉత్తరాంధ్ర లో నిరుపేద కళా కారులను ఆదుకోవడానికి అంతరించిపోతున్న ప్రాచిన నటులను ప్రోత్సహించడానికి కార్యక్రమం నిర్వహించామని అన్నారు. జీవిఎంసీ డిప్యూటీ కమీషనర్ పల్లి నల్లనయ్య ముఖ్య అతిధి గా విచ్చేసి మాట్లాడుతూ పౌరానిక కళాకారులను ఆదిరించవలసిన అవసరం ఉందన్నారు. ప్రవచన వాచాస్పతి రామకృష్ణా నంద విశ్రాంత బ్యాంకు రీజీనల్ మేనేజర్ చేన్నయ్య శెట్టి, భీమిలి ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ ఏం. ఫణికుమార్ తదితరులు మాట్లాడారు. కళాభిమానులు డి.గణేష్, కే.అరవింద్ లను సన్మానించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు ని, చిన్నరెడ్డి ని అతిధులు మేమేంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో కళా సాహితి ఆర్గనైజరులు కె. ఎస్ నాయుడు, ఏం. లక్ష్మణ్ రావు, పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, ఏచ్చెర్ల హరి, వెంకటేశ్వర దాసు తదితరులు మాట్లాడారు. అనంతరం పౌరానిక కళాకారులను కళా సాహితి సభ్యులు సన్మానం చేశారు. కార్యదర్శి ఎల్. ఆదినారాయణ వందన సమర్పణ చేశారు.

## యుద్ధం వద్దని ప్రదర్శనలు



గోపాలపట్నం : యుద్ధం వద్దు శాంతి నెలకొల్పాలని కోరుతూ జివిఎంసి 89వ వార్డు చంద్రనగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ, యుద్ధం వల్ల మానవ వినాశనం తప్ప మిగిలేది ఏమీ లేదన్నారు. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సమస్య నెలకొందని, మన దేశంలో గ్యాస్ సరఫరా తగినంత లేక హోటళ్లు, హాస్టళ్లు, అనేక ప్రైవేట్ సంస్థలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శాంతిని కోరుతూ పావురాలను ఎగరవేశారు. ఖాళీ సిలిండర్లను పెట్టి, గ్యాప్ సరఫరాను వేగవంతం చేయాలని కోరారు. యుద్ధం వద్దంటూ చిన్నారులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.పోలమ్మ, వి.మహాలక్ష్మి, కె.కాంతం, విసిసి సభ్యులు పాల్గొన్నారు. గాజువాక : ఇరాన్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సంత వద్ద సోమవారం నిరసన చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. సందర్భంగా సభ్యులు పి.వెంకయ్య మాట్లాడుతూ, యుద్ధం జరిగితే వచ్చే నష్టాలు మనకు కళ్లకుకట్టినట్లుగా కనిపిస్తున్నాయన్నారు. గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఎగుమతులు ఆగిపోవడంతో బొప్పాయి, ఇతర వ్యాపార పంటల రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇప్పటికైనా అమెరికా ఇజ్రాయిల్ తమ అహంకారాన్ని వీడి యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.వెంకయ్య, అంకంరెడ్డి శ్రీను, ఆదిరెడ్డి శ్రీను, సిహెచ్.రాముడు, తిరుపతిరావు, మహాలక్ష్మినాయుడు, పాల అప్పలరెడ్డి, సింహాచలం పాల్గొన్నారు. మాధవధార : మర్రిపాలెంలోని నరేంద్రనగర్ ప్రాంతంలో విసిసి ఆధ్వర్యంలో యుద్ధం వద్దు శాంతి ముద్దు పేరుతో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తెలుగు రమణ మాట్లాడుతూ యుద్ధం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, రత్నం, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## అనంత జ్ఞానవాహిని ఎయు

విశాఖపట్నం :అనంత జ్ఞాన వాహినిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని, విశ్వవిద్యాలయం శతాబ్ది ప్రస్థానం... జ్ఞాన ప్రవాహంగా నిలిచిందని పలువురు ఉపకులపతులు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా సోమవారం నిర్వహించిన ఎయు వైస్ ఛాన్సలర్స్ ప్యానల్ డిస్కషన్ మేధో మధనానికి కేంద్రంగా నిలిచింది. గడిచిన వందేళ్ల ప్రయాణంలో ఎయు నుంచి వివిధ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా సేవలు అందించిన, అందిస్తున్న ఉపకులపతులను ఒకే వేదికపైకి ఆహ్వానించారు. సదస్సును నిర్వహించారు. సదస్సులో భాగంగా రెండు అంశాలపై ఉపకులపతులతో ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. యూనివర్సిటీస్ ఇన్ ద గ్లోబల్ నాలెడ్జ్ ఎకోసిస్టమ్ -- ఇన్నోవేషన్, రీసెర్చ్ అండ్ ఇండిస్ట్రీ కొలాబరేషన్ అనే అంశంపై నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్‌కు ఎయు మాజీ వీసీ ఆచార్య జివిఎస్ఎన్.రాజు మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ ప్యానెల్‌లో ఆచార్య వివిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు, ఆచార్య ఎస్.రామకృష్ణరావు, ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య వై.సత్యనారాయణ, ఆచర్య వి.కేశవరావులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## చంద్రబాబు మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

**--- సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంది.**

**----- 2028 కి పూర్తి చేస్తామన్న అమరావతికి అసెంబ్లీ తీర్మానం ఎందుకు ?**

ప్రజాస్వామ్యం / గజపతినగరం:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దొంగ నాటకాలు ప్రజలకు బాగా తెలుసని పెడితే మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కన్వీనర్ బొత్స అప్పల నరసయ్య విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అమరావతి రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేయడం వెనక చంద్రబాబు నాయుడు దొంగనాటకానికి నాంది పలికారన్నారు. 2028 లో అమరావతిని పూర్తిస్థాయిలో రాజధానిగా తయారు చేస్తామని ప్రగల్బాలు పలికిన చంద్రబాబు మళ్లీ అసెంబ్లీ తీర్మానం చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఇదే తీర్మానాన్ని శాసన మండలి లో ఎందుకు చర్చకి పెట్టలేదని ప్రశ్నించారు. నాడు తాము అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులపై అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు, శాసనమండలిలో కూడా తీర్మానం చేయాలని పట్టు పట్టిన చంద్రబాబు ఇప్పుడు ఆ విధంగా ఎందుకు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో గతంలో 5000 కోట్లు ఖర్చు పెట్టిన చంద్రబాబు ,మళ్లీ ఇదే రాజధాని కోసం కొత్తగా టెండర్లు పిలవడం వెనక భారీ అవినీతి దాగి ఉందన్నారు. నాడు పోలవరాన్ని ఏటీఎం గా వాడుకున్న చంద్రబాబు, నేడు రాజధానినీ బూచిగా చూపించి ఏటీఎం గా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటున్న చంద్రబాబు రాజధాని కోసం 47 వేల కోట్లు అప్పు చేయడం ఎందుకోసమని ప్రశ్నించారు. . రైతులను , ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. రెండేళ్లలో మూడు లక్షల 30 వేల కోట్లు అప్పుచేసి ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచులు బెల్లాన త్రినాధ రావు, కె. పైడుపునాయుడు, ఉప సర్పంచు ,కర్రీ రామనాయుడు, మండల యూత్ కన్వీనర్ కర్రీ లక్ష్మణ, గిడిజాల కాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# పేదరికం లేని సమాజమే లక్ష్యం పి4తో మారనున్న 'బంగారు కుటుంబాల' తలరాతలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 30: పేదరికం లేని సమాజమే లక్ష్యం: 'పి4'తో మారనున్న 'బంగారు కుటుంబాల' తలరాతలు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పి 4 మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పి4' కార్యక్రమం రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా, తిరుపతిలో ముఖ్యమంత్రి నిర్వహించిన ఆన్‌లైన్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ?9.5 లక్షల మంది రిజిస్ట్రేషన్.. 5 లక్షల మందికి లబ్ధి ?సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడమే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.5 లక్షల మంది సహాయం కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో సహాయం కోరిన వీరిని ప్రభుత్వం బంగారు కుటుంబాలుగా గుర్తించింది. ప్రభుత్వ చొరవతో, దాతలను (మార్గదర్శకులు) ఈ కుటుంబాలతో అనుసంధానం చేయడం ద్వారా కేవలం ఏడాది కాలంలోనే 5 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు.పి3 నుంచి పి4 వరకు ఒక ప్రస్థానం ?గతంలో ప్రభుత్వం మరియు ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా రోడ్లు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయని, అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి గారు దీనికి 'ప్రజలను కూడా జోడించి ౹ా4 గా మార్చారని వక్తలు వివరించారు1995లో ప్రవేశపెట్టిన జన్మభూమి కార్యక్రమం తరహాలోనే, ఇప్పుడు సమాజంలోని ధనవంతులు, పారిశ్రామికవేత్తలు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారువెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి. ?పార్వతీపురం వంటి గిరిజన మరియు వెనుకబడిన జిల్లాల్లో పారిశ్రామికవేత్తల కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. అందులో భాగంగా ఈరోజు రాష్ట్రంలో మొత్తం 175 నియోజకవర్గాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నఇక్కడ స్థానిక మార్గదర్శకులు తక్కువగా ఉన్నందున విశాఖపట్నం వంటి నగరాల నుండి లేదా రాష్ట్ర స్థాయి నుండి పెద్ద ఎత్తున దాతలను ఈ జిల్లాలోని బంగారు కుటుంబాలకు అటాచ్ చేస్తాంఇది కేవలం ఒక ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, ఒక సామాజిక బాధ్యత అని నేతలు స్పష్టం చేశారు. "డబ్బు ఉన్నవాడు మరింత సంపాదిస్తున్నాడు, పేదవాడు పేదవాడిగానే మిగిలిపోతున్నాడు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడమే పి4 లక్ష్యం, అని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, కనీసం 10 కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారుపేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఇతర సామాజిక సేవలలో మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధి వంటి లక్ష్యాలను పి -4 ద్వారా సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదని అన్నారు. అట్టడుగున ఉన్న పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తలపెట్టిన పీ4 కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి పిలుపు మేరకు... పేదలకు చేయూతను అందించేలా పీ4 కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు సంపన్నవర్గాలు ముందుకొస్తున్నారంఎదరిక రహిత సమాజమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడిప్రతీ కుటుంబానికి అండగా ౹ా4' కార్యక్రమంజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిల్లాలో చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించడానికి 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ప్రెన్యూర్ షిప్' కింద ఇప్పటికే 5 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వీరికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు, అవసరమైన శిక్షణను ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారరు. ఈ మృతదేహాలకు సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ అన్నారు. జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుపేద కుటుంబాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ?జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 78,464 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు జెసి తెలిపారు. ఈ కుటుంబాలకు సరైన దిశానిర్దేశం చేసి, ప్రభుత్వ ఫలాలను చేరవేసేందుకు 2,998 మంది మార్గదర్శకులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన కొనియాడారఒంటరి మహిళకు అండగా నిలుస్తున్న రవణమమానవత్వానికి నిలువుటద్దంగా నిలుస్తూ, తోటివారి కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన రవణమ్మ. 'బంగారు కుటుంబం' కార్యక్రమంలో భాగంగా ఆమె ఒక నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకుని, వారికి అన్ని వేళలా అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారుబలిజిపేట మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన రవణమ్మ ప్రస్తుతం వెలుగు ఆఫీస్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. తన గ్రామంలోనే నివసిస్తున్న ఎస్. గౌరమ్మ అనే వృద్ధురాలి దీనస్థితి రవణమ్మను కదిలించింది. భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న గౌరమ్మ, గతంలో నాగుపాము కాటుకు గురయ్యారు. ఆ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడినప్పటికీ, శరీరంలో విషప్రభావం వల్ల ఆమె తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కనీసం కొద్ది దూరం కూడా ప్రయాణించలేని స్థితిలో ఉన్న ఆమెకు రవణమ్మ




అండగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమం గురించి తెలుసుకున్న జిల్లా అధికారులు రవణమ్మను ప్రత్యేకంగా అభినందించారు. ఒక సామాన్య ఉద్యోగిని అయ్యుండి కూడా, ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుని ఆదుకోవడంపై విచారించి, ఆమె అందిస్తున్న ఆర్థిక మరియు ఇతర సహాయ సహకారాలను కొనియాడారుప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణంలో గౌరమ్మకు రవణమ్మ చేదోడు వాదోడుగా నిలిచారు. గౌరమ్మ ఆరోగ్య సమస్యలకు సంబంధించి మరియు నిత్యం ఆహార అవసరాల విషయంలో రవణమ్మ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గౌరమ్మకు ఏ చిన్న కష్టం వచ్చినా రవణమ్మనే ఆశ్రయించేంతటి ఆత్మీయ బంధం వీరి మధ్య ఏర్పడింది. నాకున్నంతలో ఒకరికి సహాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ కుటుంబాన్ని దత్తత తీసుకున్నాను" అని రవణమ్మ ఈ సందర్భంగా పేర్కొన్నారు మార్గదర్శకులు ముఖ్య అతిధి దృశ్యాలువాలతో సన్మానించారు. పాఠశాల విద్యార్థులు నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, వివిధ శాఖల అధికారులు బంగారు కుటుంబాల మార్గదర్శులు, బంగారు కుటుంబ సభ్యులు ఉన్నారు.

మార్గదర్శుల వివరములు

1.జిల్లా విశిష్ట మార్గదర్శిగా ఎంపిక కాబడిన జిల్లేళ్ల మూడి అమ్మ సేవా సమితి, పార్వతీపురం వారు గత కొన్ని సంవత్సరములుగ ఎన్నో సామాజిక కార్యక్రమములు చేపడుతూ ప్రస్తుతం ౹ా4 కార్యక్రమంలో భాగస్వామ్యం కాబడ్డారు. వీరు ప్రతిదినం జిల్లా ఆసుపత్రిలో రోగులకు మరియు వారి బంధువులకు ఆహారము మరుయు దుస్తులు అందిస్తున్నారు .వీరి వార్షిక వ్యయం సుమారు రూ. 15 లక్షలు.( జిల్లేళ్ల మూడి అమ్మ సేవా సమితి అధ్యక్షులు : శ్రీ +.సోమేశ్వర రావు గారు. 2.జిల్లా స్థాయి ప్రధమ ప్రశంస పత్రానికి ఎంపిక కాబడిన మార్గదర్శి డా.దీ.అప్పలనాయుడు గారు సాలూరు మండలం, కొత్తవలస గ్రామంను దత్తత తీసుకొనడం ద్వారా 177 బంగారు కుటుంబాలకు తన వంతు వైద్య సహాయం మరియు సహకారములు అందిస్తున్నారు3.జిల్లా స్థాయి ద్వితీయ ప్రశంస పత్రానికి ఎంపిక కాబడిన మార్గదర్శి శ్రీ జష్ట్ర. శ్రీనివాసరావు గారు, వీరఘట్టం మండలం, తలవరం గ్రామం౹ా ఎఱస్త్రష్ట రాఎష్ట్రశీశ్రీ నకు ర్ఘుస్త్రవ (ఱఋుం) నిర్మాణమును రూ.1.5 లక్షలతో నిర్మించారు4.జిల్లా స్థాయి తృతీయ ప్రశంస పత్రానికి ఎంపిక కాబడిన మార్గదర్శి శ్రీ ఎ. వీరేష్ చంద్ర దేవ్ గారు కురుపాం గ్రామంలో సుమారు రూ.72,000 లతో విద్యార్థుల పరీక్షలకు అవసరంపైన ఖఙ లను పంపిణీ చేశారు

## సత్ఫలితాలనిస్తున్న "నేను చేసి మంచి



ప్రజాస్వామ్యం /గజపతినగరం:మండలం లోని మర్రివలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యా యులు కనకల చంద్రరావు కొద్దిరోజుల క్రితం పిల్లలలో నైతిక విలువలు పెంపొం దించే ఉద్దేశంతో "నేను చేసిన మంచి పని" అనే పుస్తకాన్ని రచించారు.. ఆ పుస్తకం ఇప్పుడు మంచి ఫలితాలను ఇస్తుందని కనకల విలేక రులకు తెలియజేశారు .కొద్దిరోజుల క్రితం పాఠశాల లోని విద్యా ర్థినులు తాడ్డి పూజ, ముగడ గాయత్రి లకు 1100/- దొరకగా, వారిద్దరూ తమకు దొరికిన మొత్తాన్ని గ్రామంలో గల పెద్దలకు అందజేశారు . గ్రామ పెద్దలు ఆ మొత్తాన్ని పోగొట్టుకున్న వ్యక్తులకు అందజే య డం జరిగిందని కనకల తెలియజేశారు ఆ విద్యార్థినిలు చేసిన మంచి పనిని గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వేనోళ్ల కొనియాడుతూ అభినందించడం జరిగిందని ప్రధానో పాధ్యాయులు కనకల చెప్పారు. సామాజిక బాధ్యత, నైతిక విలు వలతో విద్యార్థులు చేసిన ఈ గొప్ప పనిని తన పుస్తకమైన "నేను చేసిన మంచి పని " అనే పుస్తకంలో నమోదు చేయడం జరిగిం దని ప్రధానోపాధ్యాయుడు కనకల చంద్రరావు తెలియజేశారు.

## సొంతింటి కలకు ప్రభుత్వ భరోసా



బిమధురవాడ, ప్రజాస్వామ్యం పేదవాడి సొంతింటి కల తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కొమ్మాదిలో రూ.30.55 కోట్లతో నిర్మించిన 336 ఇళ్ల టిడ్కో ప్రాజెక్టుకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. మొదటి విడతలో 144 మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ 2018లో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టామని.. 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలి ఉన్న పనులు పూర్తి చెయ్యకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అసంపూర్ణంగా ఉన్న పనులు పూర్తి చేసి ప్రాజెక్టు ప్రారంభించామని, కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్తు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో 5.5 లక్షల మందికి సొంతింటి కల నెరవేర్చామని తెలిపారు. మధురవాడ జోన్ లో రూ. 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని.. అయిదేళ్ల వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టలేదని పేర్కొన్నారు. ధనిక రాష్ట్రాల్లో ఎక్కడా ఇవ్వనంతగా రూ. 4 వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం.. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. ఉచిత గ్యాస్ సిలిండర్లు.. రైతులకు అన్నదాత సుఖీభవ.. వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ తో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడిపై ఉన్న నమ్మకంతో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి అంతర్జాతీయ ఐటీ సంస్థలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని తెలిపారు. విశాఖకు మెట్రో రానుందని.. మధురవాడ ప్రాంతానికి రూ. వెయ్యి కోట్లతో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టులకు పరిపాలనా ఆమోదం లభించిందన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ 2018, 2019 లో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు కట్టామని.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సొంతింటి కల తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి. అయ్యప్ప నాయుడు, ఎస్.ఈ. నరసింహారావు, ఏపీడీ శ్రీరామ్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, యార్లగడ్డ జీవన్ కుమార్, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, శాఖారి శ్రీనివాస్, మన్యాల సోంబాబు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, లొడగల అప్పారావు, వాండ్రాసి అప్పలరాజు, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పిల్లా వెంకట్రావు, బోయి రమాదేవి, పోతిన శివ, గొల్లంగి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభం లో కూడా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసాం

**-బడ్జెట్ ను సక్రమంగా వినియోగించుకోవాలి**

**- జిల్లా ఇంచార్జ్ మంత్రి - వంగలపూడి అనిత**

**-పరిమిత వనరులతో సమర్ధవంతంగా పని చేయాలి**

**-రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకోవాలి**

**రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**-- జిల్లా గ్రోత్ రేట్ 15 శాతం సాదించడానికి కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్ లక్ష్యం చేరాలి**

**-- జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి**



ప్రజాస్వామ్యం / విజయనగరం:

రాష్ట్రం లో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతనిస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసామని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలను రూపొందించుకోవాలని, నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2026-27 బడ్జెట్ అవుట్ రీచ్ -- మండల వారీగా కేటాయింపు కార్యక్రమం పై అవగాహనా సదస్సును ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో తొలుత జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బడ్జెట్ అవుట్ రీచ్ లక్ష్యాలు - గత మరియు ప్రస్తుత పరిస్థితుల పై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అనంతరం ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు కలిసి జిల్లాను ముందుకు తీసుకువెళ్ళాలని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు వేయవలసి ఉందని, ఇటీవల కల్లెక్టర్ల కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఉద్యానపంటల సాగుపై చక్కటి ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రికి వివరించారని తెలిపారు. శాఖల మధ్య సమన్వయం ఉండాలని , అప్పుడే నిధుల వృధాను నివారించి సక్రమంగా పనిచేయగాలుగుతామని తెలిపారు. ఖర్చు చేసిన నిధులకు వినియోగపత్రాలను కూడా అందజేయాలని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులకు వినియోగపత్రాలను ఇవ్వకపోవడం వలన కేంద్ర నిధులు గతంలో రాలేదని, అంతే కాకుండా రాష్ట్రం కేటాయించవలసిన వాటాను ఇవ్వకపోవడం వలన కూడా నిధులను రాబట్టలేక పోయామని అన్నారు. పథకాల అమలులో శాసన సభ్యులతో చర్చించి ప్రాధాన్యతలను నిర్ణయించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత మన రాష్టానికి ఆదాయ వనరులు తగ్గిపోయాయని, పరిమిత వనరులతో సమర్ధంగా పని చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజా సేవకులుగానే భావించి బాధ్యతగా పని చేయాలనీ తెలిపారు. జిల్లా పెర్ కాపిటల్ ఆదాయాన్ని పెంచాల్సి ఉందని, ఉద్యాన సాగు ద్వారా ఇది సాధ్యమవుతుందని అన్నారు. బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ఆర్థిక వాస్తవ పరిస్థితుల్ని ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఉద్దేశ్యమని, ఇటువంటి ప్రయత్నం మొట్టమొదటి సారి చేయడం విశేషం అని అన్నారు. ప్రతి కుటుంబం నుండి ఒక పారశ్రామిక వేత్త రావాలనే స్వయం ఉపాధి ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రతి ఒక్క వ్యాపారవేత్త మరో 10 మందికి ఉద్యోగాలు కల్పించగలరని అన్నారు. జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ద్వారా రాష్ట్ర, జిల్లా ఆర్థిక పరిస్తితుల్ని వివరించారు. ఆర్థిక అవాంతరాలు ఉన్నప్పటికీ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లా 15 శాతం గ్రోత్ సాధించాలని లక్ష్యంగా పని చేస్తున్నామని, అయితే అన్ని శాఖలు కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్ లక్ష్యాలను సాధిస్తే అనుకున్న 15 శాతం సాధ్యమవుతుందని తెలిపారు. 15 శాతం వృద్ధి సాధించడానికి మౌలిక వసతులు ముఖ్యమని, అలాగే పన్నుల సేకరణ శాఖలు శత శాతం పన్నులు వసూలు చేయాలనీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, రుణాలను శత శాతం వినియోగించుకోవాలని, అప్పుడే కేంద్ర నిధులు విడుదల అవుతాయని తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అవుట్ రీచ్ ప్రోగ్రాశీ లక్ష్యాలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ --గత మరియు ప్రస్తుత పరిస్థితి , తీవ్రమైన ఆర్థిక పరిమితుల మధ్య సాధించిన ఘనమైన విజయాలు, బడ్జెట్ 2026-27 కీలక ముఖ్యాంశాలు , జిల్లాకు, నియోజకవర్గానికి, శాఖలకు కేటాయించిన నిధులపై సవివరంగా వివరించారు.జిల్లా సంక్షేమ పథకాలకు కేటాయింపు :జిల్లాకు సంక్షేమ పథకాల కోసం 2,265 .77 కోట్ల రూపాయలను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్ టి ఆర్ భరోసా కోసం రూ. 1,417.77 కోట్లను, తల్లికి వందనం కోసం 341.95 కోట్లను , అన్నదాత సుఖీభవ కోసం 325.63 కోట్లు, దీపం -- 2 క్రింద 118.62 కోట్లు, స్త్రీ శక్తీ --మహిళలకు ఉచిత బస్సు పథకం కు 30.37 కోట్లు, ఆటో డ్రైవర్ సేవలో పథకానికి 24.14 కోట్లు, మత్స్యకార భరోసాకు 7.60 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.నియోజక వర్గాల వారీగా కేటాయింపు ఈ బడ్జెట్ నందు బొబ్బిలి నియోజకవర్గానికి రూ. 325.94 కోట్లు , చీపురుపల్లి నియోజకవర్గానికి 297.43 కోట్లు, గజపతినగరం నియోజకవర్గానికి 427.43 కోట్లు , నెల్లిమర్ల నియోజకవర్గానికి 366.18 కోట్లు, రాజాం నియోజకవర్గానికి 301.92 కోట్లు, సాలూరు నియోజకవర్గానికి 63.47 కోట్లు, శృంగవరపుకోట నియోజకవర్గానికి 554.95 కోట్లు, విజయనగరం నియోజకవర్గానికి 765.68 కోట్లను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

శాఖల వారీగా కేటాయింపు :

గ్రామీణ అభివృద్ధి శాఖకు 811.48 కోట్లు, వైద్య విద్య శాఖకు 350 కోట్లు, పోలవరం ప్రాజెక్ట్ కు 302.88 కోట్లు, ప్రజా రవాణా శాఖకు 186.53 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు 185.69 కోట్లు, బలహీన వర్గాల గృహ నిర్మాణానికి 155.73 కోట్లు, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖకు 149.96 కోట్లు, కుటుంబ సంక్షేమ శాఖ కు 125.59 కోట్లు, పాటశాల విద్యా శాఖ కు 118.89 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో శాసన మండలి సభ్యులు డా. సూర్యనారాయణ రాజు, గాదె శ్రీనివాసులు నాయుడు, కావాలి గ్రీష్మ, ఇందుకూరి రఘురాజు, శాసన సభ్యులు కిమిడి కళా వెంకట రావు,నాగ మాధవి , అదితి గజపతి రాజు, కోళ్ళ లలిత కుమారి, బేబీ నాయన, జిల్లా ఎస్.పి ఏ.ఆర్. దామోదర్, కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్వి, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, డి సి సి బి చైర్మన్ నాగార్జున, మార్కెఫ్డ్ చైర్మన్ బంగార్రాజు, ముఖ్య ప్రణాళికాధికారి బాలాజీ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022